# ప్రజల మాట ప్రగతి బాట



బాన్సువాడలో పోచారం కోడలు సోనీరెడ్డిని ఇంటికి ఆహ్వానించి హారతిస్తున్న ట్రాన్స్‌జెండర్లు



బాన్సువాడలో ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు

## పోచారానికి మద్దతుగా విస్తృత ప్రచారం

- **మ్యానిఫెస్టోను వివరిస్తూ..**
- **పట్టణంతోపాటు అన్ని గ్రామాల్లో గడపగడపకూ బీఆర్ఎస్ నాయకుల ప్రచారం**

బాన్సువాడ రూరల్/బాన్సువాడ టౌన్/నస్రుల్లాబాద్, నవంబర్ 23 : బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డిని కారుగుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ దొడ్ల నీరజావెంకట్రాంరెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బాన్సువాడ మండలంలోని తిర్మలాపూర్, కొత్తాబాది, మొగులాన్‌పల్లి తండాలో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ నెర్రె నర్సింహులు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌నాయక్, రాజేశ్వర్ గౌడ్, నాయకులు దొడ్ల వెంకట్రాంరెడ్డి, గంగుల గంగారాం, సంగ్రాంనాయక్, గోపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, దేవేందర్‌రెడ్డి, మన్నె సాయిలు, ప్రశాంత్ కుమార్, భూనేకర్ ప్రకాశ్, జెట్టి హన్మాండ్లు, కొండ శ్రీశైలం, జిన్న రఘు, మల్లారెడ్డి, కుమ్మరి రాజు తదితరులు పాల్గొన్నారు.బాన్సువాడలోలోని పీఎస్ఆర్ బీడీ వర్కర్స్ కాలనీ, ఇస్లాంపూరలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి సతీమణి సోనీరెడ్డి స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. మున్సిపల్ చైర్మన్ గంగాధర్, కౌన్సిలర్లు మొతిలాల్, రమాదేవి, సరిత, దొన్కంటి వెంకటేశ్, కిరణ్ కుమార్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పత్తి శ్రీకాంత్, వార్డు అధ్యక్షుడు మజ్జు, చంద్రశేఖర్, ఉదయ్, నర్సగొండ, సతీశ్, కృష్ణారెడ్డి, ట్రాన్స్‌జెండర్లు సరస్వతి, నర్మదా, స్థానిక మహిళలు పాల్గొన్నారు. నస్రుల్లాబాద్ మండలంలోని అంకోల్ తండా, నాచుపల్లి గ్రామాల్లో గురువారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మేనిబాయి, దుర్కి విండో వైస్ చైర్మన్ అరుణ్, నాయకులు సక్రు, సవాయి సింగ్, గ్రామస్తులు పాల్గొన్నారు.





తిర్మలాపూర్‌లో ప్రచారంలో పాల్గొన్న ఎంపీపీ దొడ్ల నీరజారెడ్డి, అంకోల్ తండా గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు

## కబ్జాకోరు రవీందర్‌రెడ్డి.. తస్మాత్ జాగ్రత్త

- **పోచారాన్ని నిండు మనస్సుతో ఆశీర్వదించండి**
- **డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ, నవంబర్ 23 : బాన్సువాడ నియోజకవర్గ ప్రజల నాయకుడు పోచారం శ్రీనివాసరెడ్డిపై లేనిపోని అస్యతపు ఆరోపణలు చేస్తున్న కబ్జాకోరు ఏనుగు రవీందర్‌రెడ్డి తస్మాత్ జాగ్రత్త అని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి హెచ్చరించారు. బాన్సువాడలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎంతో మంది పేదల భూములను కబ్జాలు చేసి, పోలీస్ స్టేషన్‌లో పెట్టించి, కొట్టించావని, వారి ఉసురు తగులుతుందన్నారు. వారు తాడ్వాయి మండలం ఏనుగు స్వగ్రామం ఎర్రపహాడ్‌కు చెందిన చిట్యాల సాయన్న, దుర్గవ్వ, గాదారె బాలయ్యతో పాటు మరో ఐదుగురి దళితుల అసైన్డ్ భూములను కబ్జా చేశాడని అన్నారు. వారికి ఇప్పటికీ ఏనుగు రవీందర్‌రెడ్డితో ప్రాణహాని ఉందని.. బిక్కుబిక్కుమంటు తలదాచుకుంటున్నారని తెలిపారు. పేదల పక్షపాతి పోచారం శ్రీనివాసరెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేస్తే సహించమని, స్థాయికి మించి మాట్లాడొద్దని, పోచారం కాలిగోటికి సరిపోవని ఆయన ఘాటుగా విమర్శించారు. హైదరాబాద్‌లో నీ బతుకు గురించి మాట్లాడుకుంటున్నారని, గతంలో బ్రోతల్ కంపెనీ నడిపిన నువ్వు, నీ చీకటి బతుకును బయటికి తీయ్యమంటావా అని అన్నారు. 2014లో తమ నాయకుడు పోచారం శ్రీనివాసరెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారని, అప్పట్లో సీఎం కేసీఆర్ నియోజకవర్గానికి 1,689 డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించారని చెప్పారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో అధికారికంగా రవీందర్‌రెడ్డి పంపిణీ చేసిన ఇండ్ల లెక్క కేవలం 49 మాత్రమే అని, బాన్సువాడలో పోచారం శ్రీనివాసరెడ్డి 2014 నుంచి 2018 వరకు రెండు సార్లుతెచ్చి 3,480 ఇండ్లను పేద ప్రజలకు మంజూరు చేశారని తెలిపారు. నీ సొంత నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వని వాడివి, బాన్సువాడలో గెలువగానే డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇస్తా అని లేనిపోని మాటలు చెప్పి, రాజకీయ పబ్బం గడుపుకొంటున్నావని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎల్లారెడ్డికి అప్పట్లో సీఎం కేసీఆర్ (ఎస్‌డీఎఫ్) రూ.11 కోట్ల 25 లక్షలు మంజూరు చేస్తే.. దాంట్లో ప్రజా అవసరాలకు కేవలం రూ.6 కోట్ల 90 లక్షల మాత్రమే ఖర్చు చేసిండని, మిగిలిన డబ్బులు వెనుకేసుకున్నాడని అన్నారు. అదే బాన్సువాడ నియోజకవర్గంలో ఇచ్చిన 10 కోట్ల రూపాయలను ప్రజల అవసరాలకు, అభివృద్ధి పనులకు ఖర్చు చేశారని చెప్పారు. ఇద్దరు ఎమ్మెల్యేలుగా గెలుపొందిన తర్వాత పోచారం ప్రజలకు మేలు జరిగేలా ప్రభుత్వ నిధులు ఖర్చు చేశారని అన్నారు. అదే ఎల్లారెడ్డిలో ప్రజలను పట్టించుకోకపోవడంతో 2018లో ఎల్లారెడ్డిలో ఓడించారని ఎద్దేవా చేశారు. నేను ఎటువంటి భూ కబ్జాకు పాల్పడలేదని, బీర్కూర్ తిమ్మాపూర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తడిబట్టలతో ఎక్కుతనని చెప్పావుగా.. మా ఇంటి దేవుడు తిమ్మాపూర్ వేంకటేశ్వరస్వామి, కొండ గట్టు ఆంజనేయ స్వామి ఆలయంలోకి తడిబట్టలతో నేను ఎక్కడానికి సిద్ధంగా ఉన్నానని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి సవాల్ విసిరారు. ఏనుగు రవీందర్ రెడ్డి చరిత్ర మీ కాంగ్రెస్ పార్టీ ప్రచార కన్వీనర్ తీన్మార్ మల్లన్న యూట్యూబ్ చానల్‌లో ప్రసారం చేసి చెప్పాడని, ఎల్లారెడ్డి ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు ఓ టీవీ ఇంటర్వ్యూలో వంద ఎకరాలు కబ్జా చేశాడని, అరాచకాలు చేశాడని, దౌర్జన్యాలకు పాల్పడిన ఏనుగు రవీందర్‌రెడ్డిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారని వివరించారు. ఎర్రపహాడ్ దళితుల భూముల విషయంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు మంద కృష్ణ మాదిగ వచ్చినప్పుడు నీ కిరాయి గుండాలతో రాకుండా అడ్డుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. ఈ నెల 30 తర్వాత బట్టలు సదురుకొని పోతావని.. అది బాన్సువాడ నియోజకవర్గ ప్రజలకు తెలుసని అన్నారు. ఈ నెల 30న జరిగే పోలింగ్‌లో కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో పోచారాన్ని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్, గంగాదర్, వైస్ చైర్మన్ షేక్ జుబేర్, సింగిల్‌విండో చైర్మన్ ఏర్వాల కృష్ణారెడ్డి, వినయ్ కుమార్, శ్రీధర్, మహ్మద్ ఏజాస్, ముదిరెడ్డి విఠల్‌రెడ్డి, వనం గంగాధర్, నర్సింహాచారి, రాము, ఆమేర్, శ్రీనివాస్, ప్రశాంత్ కుమార్, యూనుస్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## సాయిబాబా ఆలయంలో స్పీకర్ ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

నస్రుల్లాబాద్, నవంబర్ 23 : మండలంలోని నెమ్లిలో ఉన్న సాయిబాబా ఆలయంలో గురువారం ఏకాదశి సందర్భంగా స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు స్పీకర్‌ను శాలువాతో సన్మానించారు. ఆయన వెంట ఎంపీపీ విఠల్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్, దుర్కి విండో చైర్మన్ దివిటి శ్రీనివాస్, నాయకులు ప్రతాప్ సింగ్, కిశోర్ యాదవ్, నాయిని హన్మాండ్లు, నాయిలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిక



బీఆర్ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ టౌన్, నవంబర్ 23 : బాన్సువాడలోని స్పీకర్ పోచారం స్వగృహంలో నస్రుల్లాబాద్, వర్ని మండలాలకు చెందిన బీఎస్పీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన సుమారు 70 మంది నాయకులు డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి సమక్షంలో గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారందరికీ డీసీసీబీ చైర్మన్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డికి సంపూర్ణ మద్దతు తెలుపుతూ ఆయా పార్టీల నుంచి స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరిన నాయకులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో బాన్సువాడ నియోజకవర్గ బీఎస్పీ పార్టీ కో ఆర్డినేటర్, నస్రుల్లాబాద్ మండలం దుర్కి గ్రామానికి చెందిన హరిప్రసాద్, 20 మంది వారి అనుచరులు, వర్ని మండలానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బీర్కూర్ శ్రీను, సాయులు, శంకర్, జీవన్, వినిత్, ప్రసాద్, సతీశ్, సలీం, హమీద్, సుమారు 50 మంది బీఆర్ఎస్ కండువాను కప్పుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్శితులై బీఆర్ఎస్ పార్టీ చేరుతున్నారని డీసీసీబీ చైర్మన్ అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నస్రుల్లాబాద్ మండలం అధ్యక్షుడు మెహన్, దుర్కి సర్పంచ్ శ్యామల, సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ కిశోర్ యాదవ్, బీఆర్ఎస్ వర్ని గ్రామ అధ్యక్షుడు హన్మాండ్లు, నాయకులు వీర్రాజు, నారాయణగౌడ్, పెర్క సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

బాన్సువాడ టౌన్, నవంబర్ 23 : ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎవరైనా అక్రమంగా మద్యం, నాటు సారా, దేశీదారును విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బాన్సువాడ ఎక్సైజ్ సీఐ యాదగిరి రెడ్డి అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి బాన్సువాడ ఎక్సైజ్ అధికారులు చేసిన ఆకస్మిక తనిఖీల్లో ఇప్పటి వరకు 98 కేసులు నమోదు అయినట్లు తెలిపారు. 16,478 లీటర్ల అక్రమంగా నిల్వ చేసిన కల్లును పారబోశామన్నారు. 92.87 లీటర్ల అక్రమ మద్యం, 120.25 లీటర్ల బీర్ బాటిళ్లు, 3.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు. ఈ అక్రమ మద్యం విలువ సుమారు 17.20 లక్షల రూపాయలు ఉంటుందని చెప్పారు. రెండు ద్విచక్ర వాహనాలు, ఒక టాటా ఇండిక కారును సీజ్ చేసినట్లు తెలిపారు. మొత్తం సీజ్ చేసిన వాహనాల విలువ రూ.20.65 లక్షలు ఉంటుందన్నారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ తేజస్వీని, హెడ్ కానిస్టేబల్ విఠల్, షరీఫొద్దీన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.